విశాలాంధ్ర విజయనగరం
పేజి నెం. 8
శనివారం 5, ఏప్రిల్ 2025

15 రోజులుగా అందని మంచినీరు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : ఎస్ కోట మండలం చీడి పాలెం గ్రామంలో గత 15 రోజులుగా మంచినీటి కుళాయిలు రావడంలేదని నీరు లేక పలు ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామ మహిళలు ఆందోళన చెందారు. మా గ్రామానికి ఉన్నటువంటి వాటర్ ట్యాంక్ వాల్ పోవడంతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నుండి నీరు వృధాగా పొలాల్లోకి పోతుందని మంచినీటి కుళాయిలలోకి రావడం లేదని ఈ విషయాన్ని పలుమార్లు సర్పంచ్ కు తెలియజేసినప్పటికీ పరిష్కారం చేయలేదని విచారణ వ్యక్తం చేశారు. ఈ విషయంపై సర్పంచ్ ను వివరణ కోరగా రెండు రోజుల్లో మంచినీరు అంతే విధంగా చేస్తామని టెలిగ్రామ్ తో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

బెల్టు షాపులను రాష్ట్ర ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది : భీశెట్టి ఆరోపణ

ముఖ్యమంత్రికి లేఖ రాసిన లోక్‌సత్తా పార్టీ!

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : రాష్ట్రంలో అదుపులేని స్థాయిలో పుట్టగొడుగుల్లా పట్టణం,పల్లె అనే తేడా లేకుండా బెల్టుషాపుల ద్వారా ప్రభుత్వమే మద్యం అమ్మకాలకు తెర తీసిందని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నదొకటి జరుగుతున్నది మరొకటని అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి లోక్ సత్తాపార్టీ నుండి లేక రాసామని లేకను విడుదల చేశారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు మూడువేల మద్యం షాపులు ఉన్నాయని వాటి ద్వారా 2025-26లో మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 27 వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తోందని ప్రభుత్వం అంచనా వేసిందని అంచనాలకు మించి బెల్టుషాపుల ద్వారా ప్రభుత్వ అధికారుల అండతో మద్యాన్ని ఏరులై పారిస్తోందని ఆరోపించారు. 2024 అక్టోబర్ నుండి 2025 మార్చి నాటికే 12 వేల కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు రాష్ట్రంలో జరిగాయని ప్రభుత్వం అసలు లక్ష్యం యువతని పుల్లుగా తగించడమేలా కనిపిస్తోందని, మద్యపానంతో కలిగే అనర్దాలు, దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇద్దరూ మద్యనియంత్రణపై దృష్టి సారించాలని రాష్ట్రంలో బెల్టుషాపులు లేకుండా చెయ్యాలని భీశెట్టి కోరారు,ఈ సమావేశంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, పి.ఎల్.ఎన్. రాజు, బోర రమేష్, పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు, ఇప్పలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : ఇళ్ల నిర్మాణాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు అన్ని అనుమతులు తప్పనిసరి అని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ భవనాలకు నివేశిన ధ్రువీకరణ పత్రం అందజేసే నిమిత్తం శుక్రవారం ముందస్తు పరిశీలన ప్రక్రియలను చేపట్టారు. ప్రణాళిక విభాగం సిబ్బందితో భవనానికి ఉన్న సెట్ బేక్సు, ఇతర కొలతలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అన్ని సజావుగా ఉండడంతో నివేశిత ధృవీకరణ పత్రాన్ని అందజేసేందుకు అర్హత ఉన్నట్లు గుర్తించారు.అలాగే పలు ప్రాంతాల్లో పారిశుధ్య విధానాన్ని గమనించారు. అంబటిసత్రం వద్ద ప్రధాన కాలువలో పూడిక చేరడాన్ని గమనించి అక్కడున్న ప్రజారోగ్య సిబ్బందిని వెనువెంటనే పూడికతీత తొలగించి వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎట్టి నిర్మాణాలను సహించబోమని స్పష్టం చేశారు. భవనాలపై కొంతమంది అనుమతులు లేకుండా హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారని అటువంటి వాటిని తొలగించి వేస్తున్నామని చెప్పారు. అనధికారికంగా ఎటువంటి హోర్డింగులు ఏర్పాటులను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధమైన నగరంగా తీర్చి తీర్చిదిద్దేందుకు తాము చేస్తున్న కృషికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ అనిత, ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ 26షాపులకు బహిరంగ వేలం ఖరారు

విశాలాంధ్ర-కొత్తవలస : కొత్తవలస మండల కేంద్రంలోని కొత్తవలస మేజర్ పంచాయతీకి చెందిన వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్లో గల 26షాపులను 2025-26 సంవత్సరానికి గానూ ప్రభుత్వ నిభందనలు, షరతులతో గుత్తకిచ్చేందుకుగానూ కొత్తవలస ఈఓపీఆర్డీ శ్రీదేవి సమక్షంలో మేజరు గ్రామ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం కం టెండరు నిర్వహించి హెచ్చు పాతదారులకు ఖరారు చేస్తూ షాపులను కేటాయించినట్లు పంచాయతీ ఈఓ బి.శైలజ తెలిపారు. బ్లాక్ నంబర్ 1,2,3 లో ప్రకటించిన 20షాపులకు ఒక్కొక్కటికీ రూ.లక్ష చొప్పున, అలాగే ఉత్తరదిశలో ప్రకటించిన 6షాపులకు ఒక్కొక్కటికీ రూ.30,000 చొప్పున ఔత్సాహికులు ధరావత్తు, సాల్వెన్స్ తో సహా పాటలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఆయా షాపుల డిమాండ్ ను బట్టి నెల అద్దెను నిర్ణయించిన ధరకు పైబడి పాటలో షాపులను ఔత్సాహికులు దక్కించుకున్నారు. బ్లాక్-1లోని షాప్-4 అమరపల్లి వీర వెంకట సత్యనారాయణ రూ.45,000 లకు, షాప్-5 ఎడ్ల దేవుడుబాబు రూ.65,500లకు, షాప్-6 విన్నకోట గున్నయ్య రూ.14,500లకు, షాప్-7 విన్నకోట శ్రీదేవి రూ.11,000లకు, షాప్-8 విన్నకోట వీర్రాజు రూ.10,000లకు, బ్లాక్-2లోని షాప్-9 ఆకుల సూరిబాబు రూ.11,500లు, షాప్-10 తీగల వెంకటరమణ రూ.14,800లు, షాప్-11 కోట సత్యవేణి రూ.13700లు, షాప్-12 కొల్లేపర వరలక్ష్మి రూ.32,500, షాప్-13 కొయ్య భవాని రూ.31,500, షాప్-14 బొడ్డు ప్రసాద్ రూ.12,500, షాప్-15 బోని పైడితల్లి రూ.15,200, షాప్-16 తొగర కోమలదేవి రూ.15,000, బ్లాక్-3లోని షాప్-17 పల్లి రామలక్ష్మి రూ.35,000, షాప్-18 మాలి సురేష్ రూ.43,200, షాప్-19 మాలి జై సాయిరాం రూ.19,900, షాప్-20 బోని శివ రూ.35,500, షాప్-21 పూసర్ల రామ్మూర్తి రూ.4,200, షాప్-23 ఉల్లి వెంకటరమణ రూ.4,000, షాప్-24 కోట గోవిందరావు రూ.14,800, అలాగే ఉత్తర దిశ వైపుగల షాప్-1 అదట అన్న మేరీ అలియాస్ రమ్య రూ.8,000లకు, 2- పాలు లక్ష్మి రూ.8100, 3-మాన్యం అచ్యుతలక్ష్మి రూ.7900, 4-అంబిక అప్పారావు రూ.7,800, 5- గవర వరహాలు రూ.8,000, 6- కరణం సన్యాసిరావు రూ.8,000ల హెచ్చు ధరకు పాడి షాపులను దక్కించుకున్నారు. పాతదారులు 6నెలల అద్దె సొమ్మును సోమవారం నాటికి చెల్లించాలని ఈఓ శైలజ సూచించారు. అలాగే 6షాపులకు సంభందించి సుమారు రూ.58 లక్షల పాత బకాయిలను చెల్లించాలని గతంలో పాడిన గుతేదారులకు నోటీసులు ఇచ్చిన గడువు సైతం పూర్తయిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైతే కోర్టు ద్వారా పాత బకాయిలు వసూళ్ళకు చర్యలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు కృష్ణ, శ్రీను, మాజీ సర్పంచ్ గొరపల్లి రాము, ఉప సర్పంచ్ పెనగంటి చెల్లయ్య, వార్డు సభ్యులు పూసర్ల రఘు, అప్పికొండ శ్రీను, టీడీపి నాయకులు గంగరాజు, అమరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లి, బిడ్డ.. అదృశ్యం.. పోలీసుల ముమ్మర దర్యాప్తు

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణంలోని శివరాం రోడ్‌లో నివాసం ఉంటున్న ఐదు నెలల పసిబిడ్డతో ఓ తల్లి అదృశ్యం కావడంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎల్ దామోదర్ రావు అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం పట్టణంలోని ఓఆర్ జనరేషన్ సంస్థ వారు పెంచి పెద్ద చేసిన జోత్స్న అనే అమ్మాయి విజయనగరంలోని శ్రీలక్ష్మి నర్సింగ్ హోమ్‌లో నర్సింగ్ శిక్షణ తీసుకుంది. అనంతరం ఉప్పల్ రింగ్ రోడ్ లోని శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ లో నర్సుగా పనిచేస్తుంది. అదే సమయంలో రమేష్ అనే వ్యక్తి ఆమెకు పరిచయం కావడంతో వీరి పరిచయం ప్రేమగా మారింది. అనంతరం వివాహం చేసుకున్న వీరు బ్రతుకుతెరువు కోసం చీపురుపల్లి పట్టణానికి చేరుకున్నారు. స్థానికంగా శివరాం రోడ్ లో ఓ ఇంటిని అద్దెకి తీసుకొని నివసిస్తున్నారు. వివాహ సమయంకి జోష్నాకు మానసికంగా శారీరకంగా ఆరోగ్యం సరిగా లేదంటూ భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. వీరికి వేదశ్రీ అనే ఐదేళ్ల పాప కూడా ఉన్నది. గుంటూరు జిల్లా నూజివీడు మండలానికి చెందిన డి రమేష్ తాపీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈనెల 3న పాపతో పాటు తన భార్య కూడా కనిపించడం లేదంటూ రమేష్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎల్ దామోదర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 91 211 09 464 లేదా 91 211 09 432 నెంబర్లకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర హైవేల అభివృద్ధికి రూ.9 కోట్లు నిధులు మంజూరు

ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి : గత ప్రభుత్వ హయాంలో రోడ్లు గుంతలు, గోతులమయంగా మారి ప్రజలు ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలుచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే బేబీ నాయన పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన రహదారులు కల్పించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన మేరకు 860 కోట్లు రూపాయలు నిధులని కేటాయించి రాష్ట్రంలో దాదాపు 20 వేల కి.మీ పైగా రోడ్ల మరమ్మత్తుల పనులు పూర్తి చేశారు.అదే స్ఫూర్తి కొనసాగిస్తూ రాష్ట్రంలో రోడ్డులు మరమ్మత్తులు చేయడానికి వీలులేని విధంగా పూర్తిగా ధ్వంసమైన సుమారు 1432 కి.మీ రహదారులను 600కోట్ల రూపాయలు నిధులు అభివృద్ధికి సంకల్పించారని ఈ రహదారుల అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) కృషితో నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర హైవేలకు సంబంధించి 2 పనులకు గాను 9.0 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు.

జీవనోపాది ప్రణాళికపై మహిళా సంఘాలకు శిక్షణ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో మహిళా సంఘాల సభ్యులు రుణాలు వారి జీవనోపాధికి సంబంధించిన ప్రణాళిక తయారీపై, వివోలకు, ఇమ్యుమేటర్లకు, గురువారం వెలుగు కార్యాలయంలో ఏపీ బంగారమ్మ అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. అందులో భాగంగా బుధవారం నుండి శనివారం వరకు శిక్షణ నాలుగు రోజులు పాటు ఇవ్వనున్నారు. ఇప్పటివరకు మండలంలో మొత్తం 1559 సంఘాలకు గాను 184 మంది ఇమ్యుమేటర్లు గుర్తించడం జరిగిందిని. ఇందులో 50 మందికి బుధవారం నుండి ఇన్యూ మేటర్లుకు శిక్షణా కార్యక్రమం చేపట్టడం జరిగిందిని అన్నారు. ఇప్పటివరకు మహిళలు తీసుకున్న రుణాల అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో వారు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమం ఏవిధంగా ఉంటుందో వారి ఆర్థిక సహకారం కావాలో గుర్తించడం జరుగుతుందన్నారు. ఆ సంఘాలపై 8 నుండి 10 ఎస్‌హెచ్‌జీలు ఇమ్యుమేటర్లు నియమించడం జరుగుతుందన్నారు. ఆయా సంఘాల మహిళల ఆర్థిక అవసరాలు జీవనోపాధిపై సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ముందుగా ఇమ్యు మేటర్ల శిక్షణ ఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం ధనలక్ష్మి, సీసీలు, వివిఓలు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై చీపురుపల్లి డీఎస్పీ దర్యాప్తు

విశాలాంధ్ర-రాజాం : రాజాంలోని శ్రీ పాలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం అర్చకుడు వేమకోటి సూర్యనారాయణ శర్మ పై మెంతిపేట ఎస్సి కొలనీలో నివాసం ఉంటున్న మహిళ మమత బెనర్జీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సి ఎస్టి అట్రాసిటీ కేసు, ఇతర సెక్షన్లతో కూడిన కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామని చీపురుపల్లి డిఎస్పీ ఎస్. రాఘువులు తెలిపారు. మెంతిపేట ఎస్సి కొలనీలో అర్చకుడు సూర్యనారాయణ శర్మ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఆ ఇంటికి వెనుకవైపున నివాసం ఉంటున్న మమత బెనర్జీ కి హద్దుల సమస్య తలెత్తింది. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఈ సమయంలో తనను. తనభర్తను అర్చకుడు కులదూషణకు పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తన ఇంటి పెరటివైపున ఉన్న మెట్లు దౌర్జనంగా కొట్టారని, దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన తనను, తన భర్త పి. వెంకన్నదొర ను తిట్టి, కొట్టడం జరిగిందని, దానివల్ల తన భర్త చికిత్స పొందుతూ ఆసుపత్రులో మృతి చెందారని ఆమె ఆరోపిస్తున్నారు. దీంతో డిఎస్పీ రాఘువులు శుక్రవారం రాజాం వచ్చారు. దర్యాప్తు నిర్వహించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడిన తరువాత సాక్షులను విచారించారు. అలాగే, ఇంటి పనులు చేసిన కార్మికులను కూడా విచారణ జరిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, గత కొద్ది నెలల క్రితమే ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తిందని, తాజాగా తలెత్తిన మహిళ మమత బెనర్జీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.మెట్ల వివాదం పై కూడా దర్యాప్తు జరుగుతోందన్నారు. ఆయనతోపాటు పట్టణ సిఐ కె. అశోక్ కుమార్ ఉన్నారు.

క్యాన్సర్ రోగికి జనసేన ఆర్థిక సాయం

అండగా ఉంటామని భరోసా

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలోని కొవ్వాడ గ్రామం చెందిన పప్పల సూర్యనారాయణ (46) అనే క్యాన్సర్ రోగికి మండల జనసేన నేతలు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆదేశాలు మేరకు శుక్రవారం ఆయన పరామర్శించారు. రూ. 40 వేలు నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పప్పల సూర్యనారాయణకు నాలుకకు క్యాన్సర్ వచ్చిందని వైద్యులు తెలిపారు. చికిత్స నిమిత్తం సుమారుగా 10 లక్షలు వరకు అవుతుందని తెలిపారు. పేద కుటుంబం కావడంతో ఆర్థిక సమస్యతో సతమతమవుతున్నారని జనసేన నేత,కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు తెలుసుకున్నారు. విషయాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కి తెలియపరచగా కార్యకర్తలంతా రోగికి ఆర్థిక సహకారం అందించాలని ఆమె చెప్పడంతో రూపాయల 40,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. రోగి చికిత్సకు అండగా ఎమ్మెల్యే సహకారం ఉంటుందని , సీఎం రిలీఫ్ ఫండ్ నుండి సహకారం అందించడానికి ప్రయత్నాలు చేస్తామని కుటుంబీకులకు వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నేతలు కోట్ల రఘు, పతి వాడ శ్రీను, రౌతు శ్రీరామ్మూర్తి గణేష్ శంక బత్తుల ,సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుకు గురై కళ్ళు గీత కార్మికుడు మృతి

విశాలాంధ్ర-గజపతినగరం : మండలంలోని ఎం కొత్తవలస గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున కల్లుగీత కార్మికుడు ఉగాది సత్యం 53 రోజువారి లాగే వారికి ఉన్న తాటి చెట్లు ఎక్కి కళ్ళు గీస్తుండగా రెండు చెట్లు ఎక్కి కళ్ళు తియ్యగా మూడవ చెట్టు ఎక్కి కళ్ళు తీసి కిందకి రాగా గుండెపోటు వచ్చిన కారణంగా అక్కడకు అక్కడే మృతి చెందారు. గజపతినగరం ఎస్సై కే లక్ష్మణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోచేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి రైతులు గుండెపోటు కారణంగా చనిపోయారని తెలిపారు అని ఎస్సై తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలోని కుమిలి ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య శిక్షణ పొందుతున్న చేస్తున్న విద్యార్థులు 12 రోజులు పాటు ఇంటెన్సివ్ శిక్షణకు మండలంలోని రెల్లి వలస పిహెచ్సికి పంపుతున్నట్లు ప్రధాన ఉపాధ్యాయిని శ్రీదేవి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని రెల్లి వలస పీహెచ్సీ సి లో శుక్రవారం విద్యార్థులు శిక్షణ పొందారు. ఒకేషనల్ టీచర్ సూరి కుమారి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సహకరించండి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏఈఆర్ఓ, తహసీల్దార్ సుదర్శనరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి సంబంధించి మెరుగైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని కోరారు. జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టేందుకు సలహాలు సూచనలు అందించాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల గుర్తింపునకు కూడా సహకారాన్ని అందించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు కంది చంద్రశేఖరరావు, గేదెల రాజారావు, ఎన్నికల డీటీ జగన్నాథరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి రెండు పశువుల శాలలు దగ్ధం

విశాలాంధ్ర-వంగర : మండలంలో ఇరువాడ గ్రామంలో రెండు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. గురువారం విద్యుత్ ఘాతుకానికి ఈ రెండు శాలలు కాలి బూడిదైనట్లు ఆగ్రామస్తులు వెల్లడించారు. ప్రధాన విద్యుత్ వైర్లు కలసి పోవటంతో ఈ ప్రమాదం సంభవించినట్లు గ్రామ స్తులు తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించటం తో వెంటనే విద్యుత్ సరఫరా ను నిలిపి వేయటం, గ్రామస్తులు స్పందించి మంటలను అదుపు చేయటంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకొన్నారు.

రాతి క్వారీలో కాలు జారి వ్యక్తి మృతి

- ప్రమాదవశాత్తు జారిపడినట్లుగా ఫిర్యాదు
- మృతిపై రేకెత్తిస్తున్న పలు అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న వల్లంపూడి పోలీసులు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీలోగల శ్రీ గణేష్ సాయి మినరల్స్ క్వారీలో ప్రమాదవశాత్తు క్వారీ గుట్టపైనుండి కాలు జారిపడి చింతల సత్తిబాబు(54) మృతి చెందాడు.ఇందుకు సంబంధించి మృతుని కుటుంబీకులు పోలీసులు అందించిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామానికి చెందిన చింతల సత్తిబాబు(54) రాత్రి క్వారీలలో బ్లాస్టింగ్ పనులు చేస్తూ జీవనోపాధి సాగిస్తుండేవాడని, గత మూడు రోజుల క్రితం చేర్లోపాలెం గ్రామానికి చెందిన ఉట సత్తిబాబుతో కలిసి కాకినాడ జిల్లా రౌతులపూడి దగ్గర క్వారీ పనుల నిమిత్తం వెళ్లి గురువారం మధ్యాహ్న సమయానికి వేపాడ మండలానికి చెందిన వీలుపర్తి లో గల చెరుకూరి శ్రీనివాసరావుకు చెందిన శ్రీ గణేష్ సాయి మినరల్స్ రాతి క్వారీలో బ్లాస్టింగ్ పనులు నిమిత్తం చేరుకున్నట్లు తెలిసిందని మృతుని కుమారుడు రాజేష్ తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు సత్తిబాబుతో పాటు ఆయనతో ఉన్న మరి కొందరు బ్లాస్టింగ్ పనులు మొదలు పెట్టలేదని శుక్రవారం ఉదయం నుండి బ్లాస్టింగ్ పనులు మొదలుపెడతామని మృతుడు సత్తిబాబు ఫోన్ ద్వారా తెలియజేసినట్లు తెలిపారు. కాగా గురువారం రాత్రి భోజనం చేసిన తర్వాత రాజేష్కు వరసకు బావ అయిన మాదిరెడ్డి సురేష్ మరో వ్యక్తి మాదిరెడ్డి వెంకటరమణతో మృతుడు సత్తిబాబు పడుకున్నట్లు తెలిసిందని అదే రోజు రాత్రి 2గంటల సమయంలో ఉట సత్తిబాబు రాజేష్‌కు ఫోన్ చేసి కాల కృత్యాల నిమిత్తం క్వారీ గుట్ట పైకి ఎక్కి అక్కడనుండి ప్రమాదవశాత్తు కాలుజారి కిందకు పడడంతో తలకు ఎడమవైపున నుదటపై బలమైన గాయం, కుడివైపు మోచేయి విరిగి గాయం, శరీరంపై గాయాలు అవ్వడంతో విశాఖ కేజీహెచ్ కు తరలిస్తున్నట్లు తెలిపాడని విషయం తెలియడంతో విశాఖ కేజి హెచ్‌కు వెళ్ళగా నా తండ్రి అయిన సత్తిబాబు తెల్లవారితే శుక్రవారం ఉదయం 5గంటలకు మరణించినట్లు డాక్టరు చెప్పారని రాజేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై కాలకృత్యాలు నిమిత్తం క్వారీ గుట్టపై నుండి కాలుజారి ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు మృతుడు సత్తిబాబుతో పాటు పనికి వచ్చిన ఊట సత్తిబాబు మాదిరెడ్డి సురేష్ మాదిరెడ్డి వెంకటరమణలు ద్వారా తెలిసిందని, ఈ మృతిపై ఎటువంటి అపోహలు గాని, అనుమానాలు గాని లేవని ఫిర్యాదుదారుడు చింతల రాజేష్ పోలీసుల వాగ్మూలం ఇచ్చినట్టు వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవి తెలిపారు. కాగా వీలుపర్తి పంచాయతీలో గల శ్రీ గణేష్ సాయి మినరల్ రాతి క్వారీకి సంబంధించి ఈసీలు గాని అనుమతులు గాని మైనింగ్ శాఖ నుండి పొందలేదని తెలుస్తుంది. అలాగే రాతి క్వారీలలో బ్లాస్టింగ్ పనుల నిమిత్తం వచ్చిన మృతుడు రాత్రి సమయంలో రాతి క్వారీ గుట్టపైకి కాలకృత్యాలకు వెళ్లడం ఏమిటని ప్రమాదవశాత్తు జారిపోయి దెబ్బలు తగలడంపై పలు అనుమానాలకు తావిస్తుందని ఈ విషయంపై పోలీసు అధికారులు తూతూమంత్రంగా కాకుండా పక్కాగా దర్యాప్తు చేపట్టి అక్కడ ఏం జరిగిందో నిజం నిగ్గు తేల్చాల్సి ఉందని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉపాధి హామీ ఏపీఓ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఉపాధిహామీ పథకం మండల ఏపీఓగా చప్పా రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గజపతినగరం నుంచి ఆయన ఇక్కడికి విచ్చేశారు. అలాగే ఇంజనీరింగ్ కన్సల్టెంట్ గా యుగేష్ బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. వారితో పాటు నలుగురు కొత్త టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏపీఓ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ గా బొండపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు సమకూరుస్తాం : ఎమ్మెల్యే కిమిడి



విశాలాంధ్ర-గుర్ల : ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు సమకూర్చడమే తామ లక్ష్యమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. గుర్ల మండలంలో దమరసింగి నుంచి చనమల్లుపేట వరకు నూతన తారు రోడ్డును ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు చేతుల మీదగా ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న పంచాయతీ కూడా తారు రోడ్డు మంచినీరు సిసి రోడ్లు కాలువలు చెరువులు బాగు చేస్తామని ఆయన అన్నారు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూస్తున్నాను అన్నారు ఈ ప్రాంతంలో అనుకూలమైన ప్రదేశాలు ఉన్నాయని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతుందన్నారు.ముందుగా పూర్ణకుంభ స్వాగతం పలికారు.ఎన్.ఆర్.జి.ఎస్ నిధులతో 1.80 లక్షల రుపాయాలతో దమరసింగి నుంచి చినమల్లుపేట కు తారు రోడ్డు దమరసింగి గ్రామంలో, 14 లక్షల రూపాయలతో పప్పల తాత ఇంటి నుంచి కేకమ్మ తల్లి గుడి వరకు,మీసాల రాంబాబు ఇంటి నుంచి హైస్కూలు వరకు నిర్మించిన నూతన సీసీ రోడ్లును ను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వెన్ని సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు సి హెచ్ మహేశ్వర రావు, మండల నాయకులు గ్రామస్థాయి నాయకులునాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల నగర పంచాయతీ

టెండర్ నోటీసు

ఆర్.సి.నెం. 123/2024-ఇ1. తేది. 04.04.2025.

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టబోవు రోడ్లు మరియు కాలువల నిర్మాణ పనులకు tender.apeprocurement.gov.in ద్వారా టెండర్లను ఆహ్వానించడమైనది.

మొత్తం పనులు	: 3 పనులు (3rd Call)
మొత్తం అంచనా విలువ	: రూ. 6.50 లక్షలు
టెండర్ డాక్యుమెంట్లు అందుబాటు తేది మరియు సమయం	: 07-04-2025 ది ఉదయం 10.30 గంటల నుండి
టెండర్లు స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం	: తే.21-04-2025 ది మధ్యాహ్నం 03.30 గంటల వరకు
టెండర్లు తెరచు తేది మరియు సమయం	: తే. 21-04-2025 ది మధ్యాహ్నం 04.00 గంటలకు

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 1) కమీషనరు - 9177687657
2) అసిస్టెంట్ ఇంజనీరు - 8520008977

ఇతర వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.

కమీషనర్ (పూ.అ.భా)
నెల్లిమర్ల నగర పంచాయతీ

గ్రామ పంచాయతీ కార్యాలయం-బొండపల్లి,
వేలం మరియు టెండరు ప్రకటన

రేఖా నెంబర్ 01/2025 తేది. 05.04.2025.

టెండర్ నోటీసు

విజయనగరం జిల్లా, బొండపల్లి మండలం, బొండపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ఈ దిగువ సుదహరించిన షెడ్యూల్-1 ప్రాప్తికి 2025-26 సంవత్సరమునకు పారిశుధ్య పనుల నిర్వహణ మరియు త్రాగునీటి నిర్వహణ (PWS) పనులు గూర్చి ఈ దిగువ చూపిన విధముగా తేదీ.08-4-2025 ఉదయం 10.30 గంటల నుండి 1.30 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీల్డ్ టెండర్లు స్వీకరించి అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు హాజరైన టెండర్‌దారుల సమక్షంలో సదరు టెండర్లు తెరవబడును. వేలంపాటలో పాల్గొన్నవారు మరియు సీల్డ్ టెండర్లు వేయగోరు వారు ఈ పంచాయతీ షరతులకు లోబడి షెడ్యూలులో చూపిన ప్రకారం చెల్లించవలసిన ధరావత్తులు ముందుగా చెల్లించి ధరావత్తులు రశీదుతోపాటు సీల్డ్ టెండర్లు దాఖలు చేయవలెను. ధరావత్తులు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. వేలంపాటలో పాల్గొన దలచినవారు రూ. 25000/-లు (అక్షరములు ఇరవై అయిదు వేల రూపాయలు) ఆస్తి విలువల గల ధృవపత్రం (సాల్వెన్సీ సర్టిఫికేటు) దాఖలు చేయవలెను. మిగిలిన వివరములు ఈ కార్యాలయం పనివేళలలో స్వయముగా వచ్చి తెలుసుకొనగలరు.

1. టెండర్లు షెడ్యూల్-1

వరుస	వివరములు	సంవత్సర	ధరావత్తు
1.	కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్య పనులు నిర్వహించుటకు ముగ్గురిని సప్లయ్ చేయుటకు	2025-26	1500
2.	కాంట్రాక్ట్ పద్ధతిపై PWS స్కీమ్‌లు ఆపరేట్ చేయుటకు ఒకరిని సప్లయ్ చేయుటకు	2025-26	600

గమనిక :- 1) ఈ గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ పనులు నిర్వహించువారు శ్రీ జిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం) వారికి లోబడి టెండర్లు దాఖలు చేయబడును. 2) కాంట్రాక్టరు కాంట్రాక్ట్ లేబర్‌కు రెండు జతలు బట్టలు, చెప్పులు, సబ్బులు మరియు కొబ్బరినూనె సరఫరా బాధ్యత వహించి టెండరు దాఖలు చేయవలెను. 3) టెండర్‌దారు కాంట్రాక్ట్ లేబర్‌కు భీమా మరియు పీఎఫ్ చేయించవలెను.

శ్రీ బొండపల్లి ఈశ్వరరావు గారు
సర్పంచ్/గ్రామ పంచాయతీ
బొండపల్లి

జి.సంతోష్‌కుమార్
పంచాయతీ కార్యదర్శి/గ్రామ పంచాయతీ
బొండపల్లి

రాజేష్ పరామర్శ

విశాలాంధ్ర-రాజాం : రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన వైకాపా నాయకులు గార సత్యనారాయణ, మామిడి శ్రీనివాసరావు కుటుంబాలను వైకాపా ఇన్ఛార్జ్ డా.తలే రాజేష్ వైకాపా నాయకులు పాలవలస శ్రీనివాసరావు, కెంబూరి నారాయణరావు, ఆశపు సూర్యం, శాసపు వేణునాయుడు, కిల్లాన మోహన్, అబోతుల రాంబాబు. జెల్ల లక్ష్మి, శాసపు బాబూరావు, డా.బి. నరేంద్ర, ఇనుముల శ్రీను. గార వెంకటరమణ, డి. నారాయణరావు, లావేటి ఆనంద్ తదితరులు పరామర్శించారు.

జీవనోపాదుల సర్వే కచ్చితంగా ఉండాలి

విశాలాంధ్ర-చీపురుపల్లి : జీవనోపాధి కల్పనకు సంబంధించి ఎన్యుమరేటర్లు జరుపుతున్న సర్వే పారదర్శకంగా ఉండాలని వెలుగు అదనపు పథక సంచాలకురాలు కే సావిత్రి శుక్రవారం చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో 2025-2026వ ఆర్థిక సంవత్సరంకి సంబందించి వార్షిక ఋణ మరియు జీవనోపాధుల ప్రణాళిక పైన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు వారి జీవనోపాధి కార్యక్రమం కోసం ఎంత మొత్తం అప్పు కావాలి, ఎప్పుడు కావాలి, ఏ అవసరం కోసం కావాలి అనే వివరాలు ఎన్యూమరేటర్ల ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక యాప్ ద్వారా ఎలా నమోదు చేసుకోవాలో అనే అంశం పైన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంనకు అదనపు పథక సంచాలకులు కే.సావిత్రి హాజరు అయి వార్షిక ఋణ, జీవనోపాధుల ప్రణాళిక సర్వే కచ్చితత్వంతో ఉండాలని, ఈ శిక్షణ అనంతరం గ్రామసంగం మరియు చిన్న సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి, సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అయిన స్త్రీనిధి ఏజీఎం ఏ.ఉమామహేశ్వరరావు ఏపిఎం ఎన్.అప్పలనాయుడు, సీసీలు, వివోఏలు, ఎన్యూమరేటర్స్ పాల్గొన్నారు.

నగరంలో దోమల నివారణకు చర్యలు : నగర పాలక కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : నగరంలో దోమల నివారణ, నియంత్రణ చర్యలను చేపడుతున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. అయితే ప్రజలు కూడా మరింత చైతన్యవంతులై దోమల వృద్ధి కేంద్రాలను సమూలంగా లేకుండా చేయాలని, అందుకు సహకరించాలని కోరారు. శుక్రవారం అన్ని సచివాలయాల ప్రాంతంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయా సచివాలయ పరిధిలోని కార్యదర్శులు చేపట్టారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ దోమల నివారణ ఎంత ముఖ్యమో నిరోధించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఇందుకోసం దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి వాటిని నియంత్రించాలని అన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలను లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉన్నట్లయితే దోమలు వృద్ధి కేంద్రాలుగా తయారవుతాయన్నారు. లార్వా దశ లోనే వాటిని తొలగించి వేస్తే దోమలు కొంతవరకు తగ్గుముఖం పడతాయన్నారు. కావున పెంకులు, కొబ్బరిచిప్పలు, టైర్లు, ఇతర నిరుపయోగ వస్తువులను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. కూలర్లు, ఫ్రిడ్జ్ కింద భాగాలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.ఇవి దోమలు వృద్ధి చెందడానికి ఆవాసాలుగా ఉంటాయని, వాటిని తొలగించి వేసినట్లయితే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు.

పురపాలనలో మెరుగైన ఫలితాలు తీసుకురండి

పురపాలక ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్

విశాలాంధ్ర-విజయనగరం : ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతాంశాలను శతశాతం అమలు చేసి పురపాలనలో మెరుగైన ఫలితాలను తీసుకురావాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయన చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా నగరంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఆదేశించారు. ముందస్తుగానే నీటి పంపిణీకి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకుని, అమలు చేయాలన్నారు. అన్నా క్యాంటీన్ల ఔన్నత్యాన్ని మరింత పెంచాలని చెప్పారు. ప్రతిరోజు అన్నా క్యాంటీన్‌లను పరిశీలించి పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత వంటి విషయాలను గమనించాలన్నారు. శతశాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలన్నారు. చెత్తలను వర్గీకరించి ప్రతి ఇంటి నుండి సేకరించినట్లయితే మెరుగైన పారిశుద్ధ్య విధానం అమలైనట్లేనన్నారు. ఆదిశగా చొరవ చూపాలన్నారు. అలాగే రెవెన్యూ వసూళ్ళను వేగవంతం చేయాలన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలముల పన్నులు, వాటర్ చార్జీలను వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. అందరి సమిష్టి సహకారంతోనే ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ వైద్య సేవలపై తనిఖీలు

విశాలాంధ్ర-రాజాం : రాజాం పట్టణంలో ఎన్ టి ఆర్ వైద్య సేవ ద్వారా (ఆరోగ్య శ్రీ) రోగులకు సేవలు అందిస్తున్న ప్రవేట్ హాస్పిటల్స్ ని శుక్రవారం విజయనగరం జిల్లా ఎన్ టి ఆర్ వైద్య సేవ జిల్లా మేనేజర్ దూబ రాంబాబు తనిఖీ నిర్వహించారు. అనంతరం హాస్పిటల్ లో ఉన్న రోగులు వద్దకు వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుకున్నారు. మీకు హాస్పిటల్ లో అందించిన వైద్య సేవలు ఎలా ఉన్నాయి, మీకు ఇస్తున్న భోజనం ఎలా ఉంది. మీకు హాస్పిటల్ వాళ్ళ నుండి ఎటువంటి ఇబ్బంది వచ్చిన, మీ వద్ద నుండి హాస్పిటల్ వాళ్ళు డబ్బులు వసూళ్లు చేసిన ఆరోగ్య మిత్రకు లేదా జిల్లా అధికారులకు తెలియచేయ్యాలని రోగులకు తెలిపారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం పంపిణి చేస్తున్న వాళ్లకు సుచి, శుభ్రత, నాణ్యమైన భోజనం రోగులకు అందించాలని అన్నారు. భోజనం బాగోలేదని రోగుల నుండి మాకు ఫిర్యాదులు వస్తే ట్రస్ట్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధుల్లో ఉన్న ఆరోగ్య మిత్ర హెల్ప్ డెస్క్ వద్ద ఉన్న రికార్డులను తనిఖీ చేసి రోగులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మిత్రులు సమయం ప్రకారం ఎఫ్ ఆర్ ఎస్ వెయ్యాలని, ఎప్పటికప్పుడు ఆన్ బెడ్ వివరాలను నమోదు చేయాలని మిత్రుకు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ అధికారులు తనిఖీలకి వచ్చినప్పుడు ఆరోగ్య మిత్రులు హెల్ప్ డెస్క్ వద్ద ఉండాలని సూచించారు. అధికారులు వచ్చే సమయంలో హెల్ప్ డెస్క్ ఖాళీగా కనిపిస్తే అలాంటి మిత్రాలపై చర్యలు తీసుకుంటారని జిల్లా మేనేజర్ దూబ రాంబాబు తెలిపారు.

జాతీయ ఉత్పత్తి ప్రజాపంపిణీ పథకంపై అసంతృప్తి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : జాతీయ ఉత్పత్తి ప్రజా పంపిణీ పథకం చౌక ధరల దుకాణంలు తెరవడంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జాతీయ ఆహార భద్రత కమిషన్ సభ్యులు కాంతారావు అన్నారు. పట్టణంలో ఆకస్మికంగా శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ పర్యటనలో ముందుగా జాతీయ ఉత్పత్తి ప్రజాపంపిణీ పథకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చౌక ధరల దుకాణం లను తనిఖీ చేయగా 11వ నెంబరు రేషన్ డిపో లో సరుకుల వ్యత్యాసం ఉండడం గమనించారు. అంతేకాకుండా సకాలంలో తెరవలేదని విజయనగరం సి ఎస్ డి టి పై మండిపడ్డారు 14వ నెంబరు రేషన్ డిపోలో ఆక్సిజన్ సిలిండర్లు ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తపరిచారు. 11 మరియు 14 రేషన్ డిపోలపై చర్యలు తీసుకోవాలని డి.ఎస్.ఓ మధుసూదనరావుకు ఆదేశించారు. 12 మరియు 19 రేషన్ డిపోలో సరుకులు సక్రంగా ఉన్నాయి 11వ నెంబర్ రేషన్ డిపోకు చెందిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండియు) వాహనాన్ని సీజ్ చేసి తహసిల్దార్ కార్యాలయానికి తరలించమని ఆయన తెలిపారు. విజయనగరం ఐసి డి ఎస్ పరిధిలో ఉన్న దక్కెన వీధి వన్ టూ, బుచ్చన్న కోనేరు వన్ టు, అరకాల గడ్డ , నాగాసపు వీధి1, 2, మరియు హుకుంపేట 1,2 అంగన్వాడి కేంద్రాలు సందర్శించారు. సందర్శించిన అన్ని కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా పిల్లలతో మాట్లాడించుగా పిల్లలు ఏ బి సి డి లు చెప్పారు అదేవిధంగా అంగన్వాడి కేంద్రంలో ఏం తిన్నారు అని ఆయన అడగ్గా గుడ్లు తిన్నామని పిల్లల తెలిపారు. సందర్శించిన అన్ని అంగన్వాడి కేంద్రాల్లో రికార్డుల ను పరిశీలించడమే కాకుండా గుడ్లు తూకం వేయించి ప్రభుత్వం నిబంధనల ప్రకారం గుడ్లు బరువు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తపరిచారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కంటోన్మెంట్ లో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ పర్యవేక్షించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించారు. ఈరోజు మెనూ ప్రకారం పులిహోర గ్రుడ్డు గోంగూర పచ్చడి ఉండడం గమనించారు అంతేకాకుండా ఇంటిదగ్గర చేసినట్లే కంటికి కనిపిస్తుందని ఆయన అన్నారు. మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి విద్యార్థినిలతో ముచ్చటిస్తూ ప్రతిరోజు అందించే ఆహారంపై ఆరా తీశారు. ఈ పర్యటనలో డీఎస్ఓ మధుసూదన్ రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి రుక్సనా సుల్తాన్ బేగం, ఐసి డేస్ పిఓ ప్రసన్న, సి ఎస్ డి టి రామారావు, ఎంఈవోలు రామచంద్రరావు, సత్యవతి, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలు చూసి తరించండి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : రామ నారాయణ పుణ్యక్షేత్రంలో ఈ నెల6 తేదీన శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 7 గంటలకు సీతారాముల వారికి స్నపన, ఉదయం 10 గంటలకు రామ తారక మంత్ర హెూమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందని ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ దంపతులు అన్నారు. ఈ సందర్భంగా ఎన్సిఎస్ మల్టీప్లెక్స్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 6 తేదీన సాయంత్రం ఐదు గంటలకు వైఖానసాగామానుసారముగా వైఖానసాగమ వాచస్పతి శ్రీమాన్ అగ్నిహెూత్రం శ్రీనివాసాచార్యులు వారి శిష్య బృందం వారిచే తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం, వేద పండితులు, వేద విద్యార్థుల వేద పఠనం నడుమ మరియు చైతన్య సోదరులు వారిచే సాంప్రదాయ సంగీత సాహిత్య సమ్మేళనంతో శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం ప్రధాన అర్చకులు గోపి నంబాళాశేషాచార్యులు వారి వ్యాఖ్యానంతో అంగరంగ వైభవంగా అపురూపంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించబడునని అన్నారు. ఈ సందర్భంగా ఆరోజు సాయంత్రం మూడు గంటలకు నుండి ఎన్సిఎస్ థియేటర్ నుండి, ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఉచిత బస్సు సౌకర్యం కల్పించబడినని అన్నారు. అదేవిధంగా 7 -4- 2025 ఉదయం 10 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, 11 గంటలకు శ్రీ వెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం, వేద విద్యార్థుల వేద పఠనం నడుమ దశమి సందర్భంగా రామకోటి పుస్తకములను రామకోటి స్తూపంలో భక్తులు స్వహస్తాలతోనే సమర్పించుటకు ఏర్పాటు చేయడమైనదని అన్నారు. అందువలన భక్తులందరూ సీతారాముల కళ్యాణ మహెూత్సవ కార్యక్రమం తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మెంబర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా నిరసన తెలపండి : సిపిఎం

విశాలాంధ్ర-బొబ్బిలి : కేంద్రంలో బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ హిందుత్వ మతోన్మాద ఎజెండా అమల్లో భాగంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులకు పాల్పడ్డారని లవ్ జిహాద్, ఘర్ వాపసీ, కామన్ సివిల్ కోడ్ మసీదుల విధ్వంసం మూక హత్యలతో హిందుత్వ శక్తులు తలపడుతున్నాయని ప్రజా సంఘాలు మేధావులు ముక్తకంఠంతో ఖండించాలని సిపిఎం నాయకులు పి శంకర్రావు పిలుపునిచ్చారు . సరికొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని ఈ చట్టం ఆస్తులు కబ్జా చేయడానికి తప్ప వక్ఫ్ ఆస్తుల అభివృద్ధికి కాదుని దుర్మార్గమైన సవరణలు చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధం ప్రకటించే ఈ బిల్లును లౌకిక పార్టీలుగా చెప్పుకునే టిడిపి జనసేనతో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కై బలపరచడంతో ఈ బిల్లు ఆమోదం పొందిందని ఆరోపించారు. టిడిపి జనసేన వైఖరి లౌకిక తత్వానికి విఘాతం కలిగించాయి. సిపిఎం సహా ప్రతిపక్షాలు ఈ బిల్లును పార్లమెంట్లో గట్టిగా ఎదుర్కొన్నాయని, ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందనీ, భారత రాజ్యాంగంలోని 25, 29, 30, తదితర నిబంధనలకు వ్యతిరేకంగా ఈ చట్టం చేశారని మసీదులు, దర్గాలు, స్మశానాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడతాయని . లక్షల ఎకరాల ఆస్తులు కొల్లగొట్టబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఇతర మతాలవారు బోర్డులో సభ్యుల్లో చేర్చి వాటిని వివాదస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉందని ఇది భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగానే చేయబడిందని దీన్ని వ్యతిరేకించాలని ప్రతిఘటించాలని ఇది కేవలం ముస్లింలే కాదు మొత్తం లౌకిక శక్తులు సమైక్యంగా ముందడుగు వేయాలని సిపిఎం తరపున బొబ్బిలి మసీదు వద్ద ప్రచారం చేశారు .

జీవనోపాధుల పెట్టుబడిపై ఎన్యుమరేటర్లకు శిక్షణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎన్యుమరేటర్లకు నెల్లిమర్ల వెలుగు కార్యాలయంలో శుక్రవారం జీవనోపాధుల పెట్టుబడిపై శిక్షణ అందించారు. శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు ఆయాగ్రామాల్లోని డ్వాక్రా సంఘాలు ఎంత మొత్తంలో రుణాలు తీసుకున్నాయి? ఆ ఋణాలతో ఏమేం వ్యాపారాలు చేశారు? తదితర వివరాలు సేకరించాలని ఏపీఎంలు సురేష్ కుమార్, పద్మ తెలిపారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి మరింత మెరుగుపరచడానికి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్ : మహిళా సంగాల సభ్యులు రుణాలు, వీరి జీవనోపాధికి సంభందించిన ప్రణాళిక తయారీపై వివోఏలకు, ఎన్యుమరేటర్లకు మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెలుగు డి పి ఎం ఎల్ హెచ్ జయశ్రీ తెలిపారు. అందులో భాగంగా బుధవారం నుంచి శిక్షణ ప్రారంభమయిందన్నారు. మూడు రోజులపాటు 210 మందికి 4 బ్యాచ్ లో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు మహిళలు తీసుకున్న రుణాలు వారి అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే కాలంలో వారు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమం ఏవిదంగా ఉంటుందో, వారికి ఎటువంటి ఆర్థిక సహకారం కావాలో గుర్తించడం జరుగుతుందన్నారు. ఈవిషయాలపై ఎనిమిది స్వయం సంఘాలకు గాను ఒక ఎన్యుమరేటర్ను నియమించడం జరుగుతుందన్నారు. ఆయా సంఘాల మహిళలకు జీవనోపాధి కార్యక్రమాలకు, చదువుకి, గృహ అవసరాలకు మరియు ఇతర అవసరాలకు కావలసిన రుణాల వివరాలు ఏవిధముగా ప్లాన్ చేయాల్సి వుంది అన్న విషయాలు ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎపిఎం రమణతోపాటు సి సిలు కోటరావు, మంగమ్మ, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

అన్న కేంటీన్లు భేష్

- అత్యుత్తమ 15 కేంటీన్లలో మూడింటికి చోటు
- రాష్ట్రస్థాయిలో జిల్లాకు చక్కని గుర్తింపు
- నిర్వహణపట్ల 98 శాతం మంది సంతృప్తి

విశాలాంధ్ర -విజయనగరంటౌన్ : అనునిత్యం పేదవారి ఆకలిని తీరుస్తున్న అన్న కేంటీన్లుకు చక్కని గుర్తింపు లభించింది. జిల్లాకు చెందిన మూడు అన్న క్యాంటీన్లకు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు దక్కాయి. ఈ మూడు క్యాంటీన్ల నిర్వహణ పట్లా ప్రజలనుంచి 98 శాతానికి పైగా సంతృప్తి వ్యక్తం కావడం విశేషం. రుచికరమైన, నాణ్యమైన ఆహార పదార్థాలను నామమాత్రపు ధరకే అందిస్తూ, ప్రజల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లకు జిల్లా ప్రజలు జైకొట్టారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన క్యూఆర్ కోడ్ ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లాకు చెందిన మూడు అన్న క్యాంటీన్లు మెరుగైన ర్యాంకులను సాధించాయి. బొబ్బిలి ఆర్అండ్‌బి ఆఫీసు సమీపంలోని అన్న క్యాంటీన్‌కు రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం, విజయనగరం ప్రకాశం పార్కులోని క్యాంటీన్‌కు ఏడో స్థానం, ఘోషా ఆసుపత్రిలోని అన్న క్యాంటిన్‌కు పదో స్థానం దక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 205 అన్న క్యాంటీన్లలో కేవలం 15 క్యాంటీన్లకు మాత్రమే మెరుగైన ర్యాంకులు దక్కగా, వాటిలో జిల్లాకు చెందిన మూడు క్యాంటీన్లకు పదిలోపు స్థానాలు దక్కడం ప్రత్యేకంగా చెప్పవచ్చు. బొబ్బిలి అన్న క్యాంటీన్ నిర్వహణ విషయంలో మొత్తం 2034 మంది క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను చెప్పగా, వీరిలో 1995 మంది (98 శాతం) సానుకూలంగా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విజయనగరం ప్రకాశం పార్కు క్యాంటీన్ నిర్వహణపై 1593 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, వీరిలో 1578 మంది (99 శాతం) నుంచి సానుకూల స్పందన వ్యక్తమయ్యింది. అదేవిధంగా ఘోషా ఆసుపత్రి క్యాంటీన్ విషయంలో 1035 మంది తమ అభిప్రాయాలను తెలియజేయగా, వీరిలో 1017 మంది (98 శాతం) సానుకూలంగా స్పందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాలకు అనుగుణంగా, ఎప్పటికప్పుడు క్యాంటీన్ల నిర్వహణను మెరుగుపరుస్తుండటంతో, జిల్లాకు ఈ అరుదైన గౌరవం దక్కింది.

మరింత మెరుగ్గా నిర్వహణ - కలెక్టర్ అంబేద్కర్ : జిల్లాలోని మూడు అన్న క్యాంటీన్లకు రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు లభించడం పట్ల అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభినందించారు. వీటి నిర్వహణను మరింతగా మెరుగుపరిచి, ప్రజలకు రుచికరంగా, నాణ్యమైన భోజనాన్ని, అల్పాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని అన్న క్యాంటీన్లూ నిర్వహణలో ఒకదానితో ఒకటి పోటీపడి, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించాలని కలెక్టర్ కోరారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పొగిరి కృష్ణవేణి

విశాలాంధ్ర-రాజాం : రాజాం కి చెందిన జనసేన నాయకురాలు పొగిరి కృష్ణవేణి(జనసేన) కు రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ (ఏఎంసీ) కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో రాజాంలో జనసేన పార్టీ కార్యాలయానికి జనసేన పార్టీ ఇంచార్జ్ పోగిరి సురేష్ బాబుతో పాటు జనసేన పార్టీ కార్యకర్తలు చేరుకుని సురేష్ మాస్టారుకు అభినందనలు తెలుపుతూ, ఆనందం తో స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు.

నగరంలో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభం

- ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఇ.పి.డి.సి.ఎల్.
- విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకే స్టేషన్ల ఏర్పాటు
- తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ సి.ఎం.డి. పృథ్వీతేజ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలనే రాష్ట్ర ప్రభుత్వ క్లీన్ ఎనర్జీ విధానంలో భాగంగా తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లను ప్రైవేటు భాగస్వామ్యంతో పిపిపి విధానంలో ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ సి.ఎం.డి. ఇమ్మడి పృథ్వీతేజ్ చెప్పారు. తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో పది విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్‌లను పైలట్ విధానంలో తమ విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నామని దీనిలో మొదటి ఛార్జింగ్ స్టేషన్ విజయనగరంలో ప్రారంభించినట్లు వెల్లడించారు. తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ, వి.ఎన్.గ్లోబల్ ఎంటర్ ప్రైజెస్ సంస్థతో కలసి నగరంలోని పాత జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఎదురుగా విశాఖ రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్‌ను సి.ఎం.డి. శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ఐదు వేల విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని నిర్దేశించారని దీనిలో భాగంగా ఇ.పి.డి.సి.ఎల్. ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. పి.ఎం.సూర్యఘర్ లో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పదివేల మంది ఎస్.సి., ఎస్.టి. వర్గాల ఇళ్లకు సౌరవిద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. వారికి ఇంటిపైకప్పుపై ఏర్పాటుకు స్థలం వుంటే ఇంటిపైనే ఏర్పాటు చేస్తామని, స్థలం లేని పక్షంలో ఇంటికి దగ్గరలో వుండే ఖాళీస్థలంలో ఏర్పాటు చేస్తామన్నారు. తమ సంస్థ పరిధిలోని జిల్లాల్లో ఇప్పటివరకు 7,800 సూర్యఘర్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యీ జిల్లాలో 700 వరకు యూనిట్లు ఏర్పాటైనట్లు చెప్పారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకొనే విధానాన్ని సులభతరం చేయడం జరిగిందని, పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొంటే త్వరగా యూనిట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు, లోడ్ అధికంగా వున్నచోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఫీడర్ల విభజన ద్వారా వేసవిలో అంతరాయాలు లేకుండా చేస్తామన్నారు. ఈ వేసవిలో ఇప్పటివరకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, రానున్న రోజుల్లోనూ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడతామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలోని 1912 విద్యుత్ కాల్ సెంటర్ మూడు షిఫ్టుల్లో 24 గంటలూ సేవలు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. తమ సంస్థ పరిధిలో 35శాతం సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే 90శాతం మేరకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయ్యిందన్నారు. వాణిజ్య కేటగిరీ, ఇతర కేటగిరీల్లో అన్ని సర్వీసులకు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. గృహవినియోగదారులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఇంకా మొదలు కాలేదన్నారు. విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్ ను కూడా సి.ఎం.డి. పృథ్వీతేజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఫైనాన్స్ డైరక్టర్ డి.చంద్రం, సి.జి.ఎం. జంగా శ్రీనివాసరావు, ఇ.పి.డి.సి.ఎల్. ఎస్.ఇ. మువ్వల లక్ష్మణరావు, ట్రాన్స్ కో ఎస్.ఇ. బాలాజీ, ఆపరేషన్స్ ఇ.ఇ. పి.త్రినాథరావు, డి.ఇ. కిరణ్, టెక్నికల్ ఇ.ఇ. పి.మురళి రూరల్ డి.ఇ. సురేష్‌బాబు, కనస్ట్రక్షన్ డి.ఇ. హరి, ఎం.ఆర్.టి. డిఇ కె.వి.సత్యనారాయణ, ఇపిడిసిఎల్ సిబ్బంది, వి.ఎన్.గ్లోబల్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

విశాలాంధ్ర-నెల్లిమర్ల : పట్టణంలోని సీకేఎమ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు అందజేశారు. సీనియర్ ఇంటర్మీడియట్ చదువుతున్న 342 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలతో పాటు ఒక్కొక్కరికి 12 చొప్పున నోట్ పుస్తకాలను ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ అందజేశారు. కళాశాలలో త్వరలో నిర్వహించే తరగతులను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ముందుగానే పుస్తకాలు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న కోళ్ల దంపతులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట మండలం ఎస్.కోట పట్టణ కేంద్రంలో గల శ్రీనివాస కాలనీ నందు శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారిలి మరియు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాం ప్రసాద్ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీఎస్ నాయుడు, కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు మరియు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తానెవ్వరినీ దుషించలేదు.. దౌర్జన్యానికి పాల్పడలేదు

అర్చకుడు సూర్యనారాయణ శర్మ

విశాలాంధ్ర-రాజాం : అ ర్చ కు లు సూర్యనారాయణ శర్మ తాను ఎవ్వరినీ దుషణ పదజాలంతో తిట్టలేదని, అవమానపరచ లేదని. దౌ ర్జ న్యా ని కి పాల్పడలేదని దేవాలయం అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ వివరణ ఇచ్చారు. తరచూ తన ఇంటి పనులకు ఆమె ఆటంక పరచడమేకాక, తమ ఇంటికి పనిచేసేందుకు వచ్చిన పని వాళ్ళను కూడా బెదిరించే వారని, అయినా, తాము పనులు చేయించు కుంటున్నామన్నారు. మహిళ ఇంటి మెట్లు తాను తొలగించలేదన్నారు. తానెవ్వరి పైన దౌర్జన్యానికి పాల్పడలేదన్నారు. వారే తిరిగి నన్ను చాలా దుర్భాషలతో తిట్టారని, అయినా, తమ పని తాము చేసుకున్నామని చెప్పారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

విశాలాంధ్ర-దెంకాడ : దెంకాడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామ పంచాయతీలో ప్రమాదాల నివారణ రోడ్డు భద్రత ప్రమాదాల అరికట్టడంపై శుక్రవారం ఆర్ అండ్ బి అధికారులు దెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు బ్లాక్ స్పాట్ ఏరియాస్ అయినా చింతలవలస జంక్షన్ అయినాదు జంక్షన్ ప్రాంతాలను సందర్శించి రోడ్డు భద్రతకు మెరుగుదలపై భద్రత అవసరాల గురించి చర్చించినారు.